కనీస వేతనం అమలు చేయాలి

- ఈ నెల 20న దేశవ్యాప్తంగా నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలి
- బహుజన, వామపక్ష కార్మిక సంఘాల జేఏసీ నేతల పిలుపు

ఓంకార్ భవనంలో నిర్వహించిన రాష్ట్ర సదస్సులో మాట్లాడుతున్న బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్

చిక్కడపల్లి, మే 14: దేశవ్యాప్త సమ్మెలో బహుజన కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని బహుజన, వామపక్ష కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ బహుజన వామపక్ష కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవనంలో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ మాట్లాడుతూ భారత బహుజన కార్మిక వర్గానికి రాజ్యాంగం కల్పించిన 44 రక్షణ చట్టాలను రద్దు చేసి కార్మిక వర్గానికి వ్యతిరేకంగా నాలుగు కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అంబానీ, అదాని లాంటి స్వదేశీ, విదేశీ కార్పొరేట్ కంపెనీల లాభాల కోసం తెచ్చిన కార్మిక వ్యతిరేక 4 కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో భారత బహుజన కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లోని ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఆలోపు సుప్రీంకోర్టు తీర్పునను సరించి కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీఎల్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.సిద్ధిరాములు అధ్యక్షతన జరిగిన సదస్సులో బహుజన, వామపక్ష కార్మిక సంఘాల నేతలు అనిల్‌కుమార్, కె.చంద్రశేఖర్ ప్రసాద్, డి.రాజేష్, మల్లేష్, ఎస్.మల్లేష్, ఖాలీల్, యదగిరి, జంగయ్య, గ్యార సాలయ్య, ఎస్.ప్రభాకర్ పాల్గొన్నారు.

మహంకాళి జాతర ఆహ్వాన పత్రిక..

ఎమ్మెల్యే తలసానికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ప్రతినిధులు

బేగంపేట్ మే 14: ప్రతిష్టాత్మక మహంకాళి జాతరకు అధికారులు ఇప్పటి నుంచే ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఆలయ ఈవో గుత్త మనోహర్‌రెడ్డి బుధవారం స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మారేడుపల్లిలోని ఆయన నివాసంలో ఆలయ అర్చక బృందంతో కలిసి బోనాల జాతరకు రావాలని ఆహ్వాన పత్రికను అందించారు. జూలై 13న మహంకాళి బోనాల జాతర, 14న రంగం కొనసాగుతాయి. ఈ ఉత్సవాలకు మరో 2 నెలల సమయం ఉంది. కాగా, గోల్కొండ బోనాల వేడుకల ప్రకటన, ఆహ్వానం ప్రారంభమైన తర్వాతే మహంకాళి జాతర ఆహ్వాన పత్రిక అందజేయడం ఆనవాయితీ. అయితే ఇందుకు భిన్నంగా మహంకాళి జాతరకు ఇప్పటి నుంచే ఆహ్వానాలు అందజేయడం స్థానికుల్లో చర్చనీయాంశంగా మారింది.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్, మే 14: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కల్యాణలక్ష్మి-4, షాదీముబారక్-5 చెక్కులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల ఆడబిడ్డల పెండ్లి ఆర్థికంగా ఎంతో భారమైన తరుణంలో ఆర్థికంగా అండగా ఉండాలనే ఆలోచనతో కేసీఆర్ నాయకత్వంలోని అప్పటి ప్రభుత్వం ప్రారంభించిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, ఖైరతాబాద్ తహసీల్దార్ కార్యాలయ సురేష్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు నామన సంతోష్ కుమార్, శ్రీహరి, నరేందర్, శేఖర్, ఆరీఫ్, గోపిలాల్‌చౌహాన్, కూతురు నర్సింహ, బలరాం, హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ నిర్మాణంతో సమస్యలు పరిష్కారం


నూతనంగా ఎన్నికైన అసోసియేషన్ అధ్యక్షుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

బేగంపేట్, మే 14: డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం తర్వాత కాలనీ ప్రజల సమస్యలు పరిష్కారమయ్యాయని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ చెప్పారు. ఇటీవల బన్సీలాల్‌పేట డివిజన్ జీవైఆర్ కాంపౌండ్ డబుల్ బెడ్రూం అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా వెంకట్‌బాబు ఎన్నికయ్యారు. బుధవారం కాలనీవాసులతో కలిసి ఎమ్మెల్యేను వెస్ట్ మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెంకట్‌బాబును ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తలసాని మాట్లాడుతూ అప్పటి సీఎం కేసీఆర్ నాయకత్వంలో చేపట్టిన డబుల్ బెడ్రూం పథకంలో భాగంగా జీవైఆర్ కాంపౌండ్‌లో ఇండ్లను ఉచితంగా నిర్మించి ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కాలనీ ప్రజలు అంతా కలిసికట్టుగా ఉండి కాలనీని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఖాళీగా ఉన్న వాటిని అర్హులైన స్థానికులకే కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కాలనీవాసులు కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లక్ష్మిపతి, నరేష్‌బాబు, జయంతి, లావణ్య, బాలరాజ్, జహంగీర్, సత్యం, సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తి కలిగించే రచనలు మల్లాది సొంతం

ముషీరాబాద్, మే 14: మల్లాది రామకృష్ణ శాస్త్రి రచనలు సంప్రదాయ, ఆధునికత కలబోతగా చక్కని భాషా పద ప్రయోగం పాఠకుల్లో ఆసక్తి కలిగించే విధంగా ఉంటాయని హాస్యావధాని, ప్రముఖ పాత్రికేయుడు శంకర నారాయణ అన్నారు. త్యాగరాయ గానసభలో ఎందరో మహానుభావులు పేరుతో నిర్వహించే కార్యక్రమ పరంపరలో భాగంగా విఖ్యాత కవి పండితుడు మల్లాది రామకృష్ణ శాస్త్రి యాదిలో సంస్మరణ సభ జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శంకర నారాయణ పాల్గొని మల్లాది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ భాషలే కాకుండా విదేశీ భాషల్లో సాధికారత గల బహుభాషా విజ్ఞాని అని అన్నారు. ఆయన రచించిన కథలు తెలుగు భాషకు ప్రామాణికంగా నిలుస్తాయని పేర్కొన్నారు. జీవిత మంతా జ్ఞాన సంపద కోసం కృషి చేసిన రామకృష్ణ అత్యంత నిరాడంబర జీవితం గడిపారనీ గుర్తు చేశారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సాహితీ కిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు, గాయకులు శ్రీమణి, ధారా సుబ్రహ్మణ్యం, మల్లం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న శంకర్ నారాయణ

బోయిన్‌పల్లి

నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన తిరుపతి రాజును మంగళవారం బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్లో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.
– బొల్లారం, మే 14:

దూరవిద్య ఎంసీఏ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూరవిద్య కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్ సీడీఈ) ద్వారా అందించే ఎంసీఏ కోర్సు రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవాలని సూచించారు.

బీఎఫ్ఏ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఎఫ్ఏ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎఫ్ఏ (అప్లైడ్ ఆర్ట్స్, పెయింటింగ్, ఫోటోగ్రఫీ) రెండు, నాలుగు, ఆరు, ఎనిమిది, పదో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును ఈ నెల 27లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ. 500 అపరాధ రుసుముతో 30వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవాలని సూచించారు.

నిషేధిత పదార్థాలు అమ్మొద్దు

ఎర్రగడ్డ: బోరబండ పోలీసులు ఠాణా పరిధిలోని పాన్ దుకాణాల నిర్వాహకులతో సమావేశమై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. స్థానిక సీజన్స్ ఫంక్షన్ హాల్లో బుధవారం జరిగిన సమావేశంలో ఇన్‌స్పెక్టర్ సురేందర్ మాట్లాడుతూ గుట్కా, ఖైనీ, తంబాకు వంటి నిషేధిత పదార్థాలు విక్రయించవద్దని అన్నారు. 18 ఏండ్ల లోపు వాళ్లకు సిగరెట్లు, నిషేధిత వస్తువులను అమ్మొద్దని సూచించారు.

అమీర్‌పేట్‌లో క్రైస్తవుల సామూహిక విందు

క్రైస్తవ ప్రముఖులతో ఎమ్మెల్యే తలసాని, చిత్రంలో మాజీ కార్పొరేటర్ శేషుకుమారి

అమీర్‌పేట్, మే 14: అమీర్‌పేట్ డివిజన్‌లోని ఏడు చర్చిల ప్రతినిధుల సామూహిక విందు జరిగింది. వివేకానంద కమ్యూనిటీ హాల్‌లో జరిగిన విందుకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దాదాపు 350 మంది ప్రతినిధులతో విందులో అమీర్‌పేట్ మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారితో పాటు క్రైస్తవ ప్రముఖులు రెవ.డా.కొత్తపల్లి సైమన్ పీటర్, రెవ.డా.రెజినాల్డ్, పాస్టర్ ప్రకాష్, పాస్టర్ సుదర్శన్, బ్రదర్ ప్రసాద్, పాస్టర్ నగరం ఫిలిప్, పాస్టర్ సురేష్ మనోహరన్, పాల్గొన్నారు. వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు సంతోష్ మణికుమార్, దాడి ప్రవీణ్‌రెడ్డి, కూతురు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో అక్షయ్ సత్తా

విద్యార్థి అక్షయ్‌కుమార్‌ను అభినందిస్తున్న విశ్రాంత ప్రొఫెసర్ లింబాద్రి, తదితరులు

చిక్కడపల్లి, మే 14: ఆర్ఎల్ అకాడమీ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా కావలిలో నిర్వహించిన ఏపీ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో బాగ్‌లింగంపల్లి డా.బీ.ఆర్.అంబేడ్కర్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ప్రథమ సంవత్సరం చదుతున్న విద్యార్థి ఎం.అక్షయ్‌కుమార్ మెన్ కేటగిరీలో ద్వితీయ స్థానం కైవసం చేసుకుని సత్తా చాటాడు. తెలుగు రాష్ట్రాల నుంచి 191 మంది క్రీడాకారులు పాల్గొనగా ద్వితీయ స్థానం సాధించడం విశేషం. ఈ సందర్భంగా బుధవారం కళాశాల కరస్పాండెంట్ సరోజా వివేక్, ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, డైరెక్టర్ డా.విష్ణుప్రియ అక్షయ్ కుమార్‌ను ఘనంగా సన్మానించి, అభినందించారు. అదేవిధంగా ప్రిన్సిపాల్ ఎం.శేఖర్, ఫిజికల్ డైరెక్టర్ టి.శ్రావణ్, అధ్యాపకులు, విద్యార్థులు కూడా అక్షయ్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు.

ఏసీ, ఫ్రిడ్జ్ రిపేరింగ్‌లో ఉచిత శిక్షణ

బన్సీలాల్‌పేట్, మే 14: వేసవి సెలవుల్లో ఉన్న విద్యార్థులు, నిరుద్యోగులకు సమయాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ఉచిత నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని జనహిత సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఎస్. నరసింహమూర్తి తెలిపారు. ముషీరాబాద్ చౌరస్తా సమీపంలో, భోలక్‌పూర్‌లోని తమ శిక్షణ కేంద్రంలో నెల రోజుల పాటు ఇచ్చే శిక్షణలో ఏసీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్, ఎయిర్ కూలర్, గీజర్ల రిపేరింగ్ నేర్పిస్తామని అన్నారు. అలాగే, 15 రోజుల పాటు హోమ్ క్లీనింగ్ కోర్సు గురించి ఉచిత శిక్షణ ఇచ్చి, అనంతరం సర్టిఫికెట్ కూడా అందిస్తామని ఆయన తెలిపారు.18 ఏళ్ల నిండిన వారు ఎవరైనా చేరవచ్చని ఆయన అన్నారు. వేసవి సెలవులు ఉన్న విద్యార్థులు ఈ శిక్షణకు హాజరై సమయం సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు ఎం.శ్రీనివాస్ నంబర్ 81068 87523లో సంప్రదించాలని ఆయన కోరారు.

షెడ్డులో దగ్ధమైన స్కూల్ బస్సు

బొల్లారం, మే 14: బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని టాటా షోరూం సమీపంలో బోయిన్‌పల్లి చెక్ పోస్ట్ వద్ద మరమతుల కోసం వచ్చిన జనగామకు చెందిన ఓ స్కూల్ బస్సు అనుమానాస్పదంగా దగ్ధమైంది. కాగా పక్కనే ఉన్న డీసీఎం వ్యాను కూడా పూర్తిగా దగ్ధమైంది. బుధవారం రోజువారి మాదిరిగా వాహనాలకు డెంటింగ్ పని చేస్తుండగా స్కూల్ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగి కాలిపోయిందని అగ్ని మాపక కేంద్రానికి స్థానికులు సమాచారం అందించారు. సకాలంలో ఫైర్ సిబ్బంది చేరుకొని మంటలు ఆర్పడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కాగా మెకానిక్ షెడ్‌లో బస్సు ఎలా దగ్ధమైందని, ఆకస్మాత్తుగా బస్సులో మంటలు ఎలా చెలరేగాయని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారమివ్వాలి

బోయిన్‌పల్లిలోని పలు ప్రాంతాల్లో తనిఖీల్లో భాగంగా కవాత్తు చేస్తున్న పోలీసులు

బొల్లారం, మే 14: అనుమానాస్పదంగా వ్యక్తులు సంచరిస్తే డయల్ 100కు సమాచారం అందించాలని బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు తెలిపారు. బుధవారం బోయిన్‌పల్లి సీఐ తిరుపతి రాజు, డీఐ సర్దార్‌నాయక్ ఆధ్వర్యంలో బోయిన్‌పల్లిలో తనిఖీలు నిర్వహించారు. గణేష్ పాన్‌షాప్ చౌరస్తా, న్యూబోయిన్‌పల్లి చౌరస్తా, సెవెన్ టెంపుల్, జయనగర్, కంసారి బజార్‌లలో పర్యటించారు. ఆర్టీసీ బస్సులు, ఆటోల్లో ప్రయాణికుల లగేజీ, బ్యాగులు తనిఖీలు చేశారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా, వస్తువులు కనిపించినా, ఇతర రాష్ట్రాలకు సంబంధించిన వ్యక్తులు అనమానాస్పదంగా కనిపించినా 100 డయల్‌కు సమాచారం అందించాలని సూచించారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా, ప్రజల భద్రత కోసం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి ఎస్సైలు శివ శంకర్, గిరిధర్, నాగేంద్రబాబు, కల్పన, పోలీస్ సిబంది పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగికదాడి

బంజారాహిల్స్, మే 14: పెళ్లి చేసుకుంటానంటూ నమ్మించి యువతిపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడడంతో పాటు డబ్బులు తీసుకుని ఉడాయించిన వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే..ఢిల్లీ సమీపంలోని ఘజియాబాద్ ప్రాంతానికి చెందిన యువతి(28) ఎంబీబీఎస్ పూర్తిచేసి కాస్మోటాలజీలో స్పెషలైజేషన్ చేసింది. బంజారాహిల్స్‌లోని ఓ సంస్థ లో స్కిన్ అండ్ హెయిర్ స్పెషలిస్ట్‌గా ఆరునెలల క్రితం చేరింది. అదే సంస్థలో హెచ్ఆర్ హెడ్‌గా పనిచేస్తున్న భరత్ (33) అనే వ్యక్తితో పరిచయం ఏర్పడిం ది. యువతిని ప్రేమిస్తున్నానని నమ్మించడంతో పాటు పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. కొన్నాళ్ల తర్వాత వీరిద్దరినీ ఉ ద్యోగంలో నుంచి తీసేయడంతో బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 14లో సొంతం గా వ్యాపారం ప్రారంభించారు. దీనికోసం యువతివద్దనుంచి భరత్ సుమా రు రూ.2.5లక్షలు తీసుకున్నాడు. కాగా ఇటీవల భరత్‌కు ముందే పెండ్లి అయిందని తేలడంతో అతడు నివాసం ఉంటున్న ప్లాట్‌కు వెళ్లి చూడగా ఆరునెలల గర్భంతో ఉన్న భార్య కనిపించింది. తనను మోసం చేసిన భరత్‌పై చర్యలు తీసుకోవాలని బాధిత యువతి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బీఎన్ఎస్ 69 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పై కేసు నమోదు

బంజారాహిల్స్, మే 14: రాంగ్ రూట్‌లో కారు నడుపుతూ రావడంతో పాటు ట్రాఫిక్ పోలీసులు ఆపినా ఆగకుండా వెనక్కి తిప్పుకుని వెళ్ళిన ఘటనలో సినీ నటుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మీద జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ జర్నలిస్ట్ కాలనీ చౌరస్తా లో మంగళవారం మధ్యాహ్నం జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-45 వైపు నుంచి వస్తున్న సినీ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ జర్నలిస్ట్ కాలనీ వద్ద రాంగ్ రూట్లో వెళ్లేందుకు ప్రయత్నించాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న జూబ్లీహిల్స్ ట్రాఫిక్ కానిస్టేబుల్ నరేష్ అతడి కారును ఆపి, రాంగ్ రూట్లో ఎలా వెళ్తావంటూ ప్రశ్నించాడు. కానిస్టేబుల్ వైపు కోపంగా చూస్తూ వేగంగా కారు వెనక్కి తిప్పి ఆపకుండా వెళ్ళిపోయాడు. అతడి వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీ స్ ఉన్నతాధికారుల సూచనతో బుధవారం ట్రాఫిక్ కానిస్టేబుల్ నరేష్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మీద కేసు నమోదు చేశారు.

పర్మిట్ రూమ్‌లో గొడవ.. వ్యక్తిపై దాడి

బంజారాహిల్స్,మే 14: పర్మిట్ రూమ్‌లో బీర్ బాటిల్ పగలగొట్టవద్దని చెప్పినందుకు ఓ వ్యక్తిని చితకబాదిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నవ నిర్మాణ్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఏ.అశోక్‌కుమార్ అనే వ్యక్తి కారు డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. మంగళవారం సాయం త్రం ఫిలింనగర్‌లోని గోల్డ్‌స్పాట్ వైన్‌షాపునకు వెళ్లిన అశోక్ కుమార్ పర్మిట్ రూమ్‌లో కూర్చుని మద్యం సేవిస్తున్నాడు. పక్కన కూర్చున్న ఓ వ్యక్తి మద్యం మత్తులో బీర్ బాటిల్‌ను పగలగొట్టడంతో అశోక్‌కుమార్ వారించాడు. బీర్ బాటిల్ పగలగొట్టడం వల్ల పక్కనున్న వ్యక్తులు గాయపడే ప్రమాదం ఉందని చెప్పడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. కాసేపు గొడవపడి బయటకు వెళ్లిన గుర్తుతెలియని వ్యక్తి మరో ఇద్దరిని తీసుకొచ్చి అశోక్ కుమార్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితుడు ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆర్టీసీని అధోగతి పాలు చేసిన ఘనత కాంగ్రెస్‌దే

అడ్డగుట్ట, మే 14: ఆర్టీసీని అన్ని విధాలుగా అధోగతి పాలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని బీఆర్ఎస్ నగర సంయుక్త కార్యదర్శి గుండవేణి రాజేష్‌గౌడ్ (పెద్దన్న) బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మహిళల కోసం పెట్టిన ఫ్రీ బస్సును పూర్తిగా మహిళలే వ్యతిరేకిస్తున్నారని, ఉచిత బస్సు ప్రయాణం వల్ల తాము ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. నగరంలోని చాలా ప్రాంతా ల్లో సరిపడా బస్సులు లేక ప్రజలు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఎదురైందని ఆయన తెలిపారు. ప్రధానంగా తార్నాక నుంచి ఈసీఐఎల్‌కు తక్కువ బస్సులు ఉండడంతో ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగినులు చాలా అవస్థలు పడుతున్నారని, వెంటనే ప్రభుత్వం స్పందించి బస్సుల సంఖ్యను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ అన్ని విధాలుగా బాగుండేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ఆర్టీసీ పూర్తిగా గాడి తప్పిందని ఆయన స్పష్టం చేశారు.

అండర్ 14 క్రికెట్ టోర్నమెంట్

చిక్కడపల్లి, మే 14: గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావని ఆధ్వర్యంలో నీవీ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో గాంధీనగర్ డివిజన్‌లో ఈ నెల 16, 17 తేదీల్లో అండర్ 14 క్రికెట్ టోర్నమెంట్ 2025 నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. నిర్వాకులు వినయ్‌కుమార్ మాట్లాడుతూ శుక్ర, శనివారాల్లో స్థానిక శ్రీనివాసా గ్రౌండ్స్‌లో క్రికెట్ టోర్నమెంట్ జరుగుతుందన్నారు. ప్రముఖుల చేతులమీదుగా నగదు బహుమతి, ట్రోఫీలతో పాటు సర్టిఫికెట్లను అందచేయనున్నమని వివరించారు. ఆసక్తి గల వారు తమ ఆధార్ కార్డు జిరాక్స్‌తో నిర్వాహకులను సంప్రదించాలని కోరారు. వారి నంబర్లు 91773 02777, 77996 5788 సంప్రదించాలి. నాయకులు వి.నవీన్‌కుమార్, రత్న సాయిచంద్, శ్రీకాంత్, దామోదర్, పి.నర్సింగ్‌రావు, సత్తిరెడ్డి,శివకుమార్, సాయి కుమార్, ఆనంద్‌రావు, సత్యేందర్, రాహుల్, సాయి తేజ, నీరజ్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్ డివిజన్‌లో కలుషిత నీటి సరఫరా

ముషీరాబాద్, మే 14: రాంనగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కలుషిత నీటి సరఫరా స్థానికులను ఆందోళన గురిచేస్తోంది. పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తి చేసిన జలమండలి అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోకుండానే నీటి సరఫరా చేయడంతో మురుగునీరు సరఫరా అవుతోంది. ఇటీవల సాగర్‌లాల్ ఆసుపత్రి వద్ద భారీ పైప్‌లైన్ నిర్మాణం చేపట్టిన అధికారులు, జాగ్రత్తలు తీసుకోకుండానే నీటి సరఫరా చేశారు. దీంతో పలు బస్తీలకు కలుషిత నీటి సరఫరా జరిగింది. హరిన గర్, అబ్బాసాయి అపార్ట్‌మెంట్ లైన్, కృష్ణనగర్, ఎస్ఆర్టీ కాలనీ, అంబేద్కర్‌నగర్ ప్రాంతాల్లో మంచినీటి నల్లాల్లో మురికి నీరు సరఫరా అవుతుందని స్థానికులు తెలిపారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు ముదిగొండ మురళి, నీలాదేవి సమస్యను జలమండలి డీజీఎం మోహన్ రాజ్ తీసుకువెళ్లడంతో సమస్యను త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు.

హరినగర్‌లో కలుషిత నీటి సరఫరా చూపుతున్న మహిళలు